'మిస్ లైలా'

గొల్లపూడి జోగారావు

(రెండవభాగము)

౧

నేను దాదివృత్తిలో ప్రవేశించి రెండుసంవత్సరము లవుతుంది. నాది పవిత్రజీవనము. నారోగులను యెంతో వుత్సాహంగా నర్సుచేసేదాన్ని. 'లైలా, నీనర్సింగుతోటే సగంరోగము పోతుంది' అని శ్లాఘించే వారు డాక్టరుగారు. మేరీ, నేనూ సహవాసులమే. మాయిద్దరిదీ వొకటేవార్డు. నాది రాత్రిడ్యూటీ. మేరీ యెప్పుడూ సరదాగానే వుండేది. "లైలా, నారోగుల హృదయముల నువ్వు ఆకర్షిస్తున్నావు నిన్ను నేను envy చేస్తున్నా" ననేది. నే నెంత అదృష్టవంతు రాలిని. నాపూర్వపురోజులు తలచుకొన్నపుడు ఒక మానవహృదయం భరింపరానంత దుఃఖం వచ్చేది. ఇప్పుడు ఇట్టి పవిత్రజీవనము చెయ్యడానికి వీలుకలిగించిన డాక్టర్ని, మేరీని నిత్యమూ మన్నించేదాన్ని. నాభర్తకు, డాక్టరుగారికి వుండే స్నేహము, ఆమె కాయనయెడల నుండే గౌరవము చెపుతూ మేరీ తరచుగా మందలిస్తూ వుండేది నన్ను.

నాటిసాయంత్రము హాస్పిటలురూములో కూర్చున్నాను. మేరీ అప్పుడే వెళ్లిపోయింది. టెలిఫోనుగంట మ్రోగింది. దగ్గరకు వెళ్లి పట్టుగున్నాను.

"లైలా!"

"ఆఁ"

"నెం. ౧౨ రూముకి వెళ్లు."

మరేమీ వినబడలేదు. డాక్టరు వెళ్లిపోయా రనుకున్నాను. ముందుగానే బయలుదేరా ఆరూముకేసి. తలుపు దగ్గరగా వేసుంది. మెల్లగా లోపల ప్రవేశించాను. నలుబది వత్సరముల స్త్రీ మంచంమీద పడుకున్నుంది. మంచందగ్గరగా వెళ్లేను. ఆమె నాకేసి చూచింది. మాయిద్దరికీ యిల్లా సంభాషణ జరిగింది:

నేను—ఏవిఁటి బాధ?

ఆమె కడుపుచూపెట్టింది.

నేను—ఆపరేషన్ చేస్తా మన్నారా?

ఆమె—అవును.

నేను—ఎప్పుడు?

ఆమె—రేపుదయం.

నేను లాకరు (locker) కేసి చూస్తున్నాను.

ఆమె—మీ పేరు లైలాగదూ?

నేను—అవును. మీ కెల్లా తెల్సు?

ఆమె—ఇక్కడ ఆయా చెప్పింది మీరు వస్తారని.

నే నామె టెంపరేచరు తీసుకోడానికి దగ్గరకు పోయాను. పరిచయం వున్న మొగంమల్లే కనబడ్డాది. నిదానించి చూచేను. మనసు చలించింది. హృదయం ఆరాటపడ్డాది. బాధ పైకి తోపనీలేదు. థర్మామీటరు తీసుకొని నామొగం చటుక్కున తిప్పేసేను. మరల యిట్లు ప్రశ్నించేను:

నేను—మీ రెక్కడున్నా రిప్పుడు?

ఆమె వూరుకుంది.

నేను—మీది రాజమండ్రీ కాదూ?

ఆమె—అవును.

నేను—మీరు చెన్నపట్నం వచ్చి యెంతకాలమయింది?

ఆమె—ఆరు నెలలు.

నేను మాటలాడలేదు.

ఆమె—మరేమి భయంలేదుకద?

నేను—లేదు.

ఆమె—కడుపుకాదన్నారు డాక్టరుగారు.

ఆమె నాకేసి చూచింది.

" మీ రట్టే మాట్లాడకండి."

ఆమెకు వలయు సదుపాయములు చేసాను. ఆమెకు ధైర్యం చెప్పేను.

" వార్డు చూచుకొనివస్తా. "

ఆమె వూరుకుంది.

" మరేం భయములేదు, పడుకోండి. "

" నిద్ర పట్టలేదు. "

ఆమె నిద్రపోవడానికి మందిచ్చేను.

" మళ్లీ వస్తారుకదూ? "

" నేను రాత్రల్లా యిక్కడే వుంటాను. "

ఆమె కనులుమూసింది. నేను బయలుదేరాను. మనసులో శాంతిలేదు. వార్డు చూచుకొని రూములోకి పోయాను. ఎన్నో ఆలోచనలు తట్టేయి. 'అత డిక్కడే ప్రాక్టీసు పెట్టేడా?'......'రాజేశ్వరీ, న న్నెన్ని బాధలు పెట్టేవు?' ఆనిర్దాక్షిణ్యురాలి కిప్పటికి పాపఫలము పండిందా అని సంతోషించాను. అమా యికురాలను లీలను పెట్టినబాధలకు యిప్పు డిల్లా అనుభవిస్తోం దనుకున్నాను. పతిమీద చెలాయించిన అధికారమునకు ఈస్థితి అని ఆనందించేను. అంతట్లోనే నాహృదయం కరగిపోయింది. ఆమె కఠినహృదయు రాలైతేనేమి, నేను జాలివహించకూడదా అనుకున్నాను. ఆమె నన్ను ఠరిమితేనేమి, నేను ఆదరిద్దామని నిశ్చ యించుకొన్నాను. ఇంతకీ నాప్రస్తుత ఉద్యోగాన్ని బట్టి నే నల్లా ఆచరించడం నావిధిగా భావించు కొన్నాను.

ఊర్లో గడియారం ఒంటిగంట కొట్టింది. నెం. ౧౨ రూములోకి పోయాను. ఆమె పడుకొనుంది. ఆమె నిశ్చేష్టితమైన ఆకారంకేసి చూసేను. ఎందుకో నేత్రగోళములు చెమ్మగిల్లేయి. ఆయాతో 'జాగ్రత్త' అని చెప్పి అడుగులువేసా కారిడరుకేసి.

౨

కనులువిప్పి చూచేసరికి కర్టెనుసందునుంచి గవాక్షమార్గంద్వారా సూర్యకిరణాలు పడుతోన్నాయి గదిలో. లేచి వాచీ చూసేను. తొమ్మి దయింది. రాజేశ్వరి యెల్లాగుందో? ఆపరేషను చేసేరా? మేరీ పదకొండుగంటల కొస్తుంది. ఎన్నో వినూత్న భావ ములను రచించినది మనసు. 'ఆనిర్దయురాలి విషయము నా కెందుకో?' అనుకున్నాను. 'ఆమె బ్రతుకు తుందా?' అని అంతరాత్మని ప్రశ్నించేను. మనసు శాంతించలేదు. 'ఎందు కీఆతురత? నా జీవనప్రవృత్తిలో ఆతురతకు తావేలేదా?' అనుకున్నాను. మేరీ వచ్చే దాక మనసు వుండబట్టలా. హాస్పిటలుకి బయలుదేరేను. మేరీవున్న వార్డుకేసి పోయాను. గదిలో మేరీ యేదో మందుసీసా చూస్తోంది.

" ఎలాగుంది? "

" ఎవరు? "

" నెం. ౧౨ రూముపేషెంటు. "

" తెలివిరాలేదు. "

" బ్రతుకుతుందా? "

" ఏమో... "

" డాక్టరుగా రేమన్నారు? "

" ఏమీ చెప్పలేదు. "

మేరీ వడిగా వెళ్లిపోతోంది.

" మేరీ! "

ఆమె వెనుదిరిగింది.

" ఆమె...... "

"..........."

" ఆమెను నీకు తెలుసా? "

" తెలీదు. "

" మేరీ, ఆమెను నేను పోల్చేను. "

" ఎవరు? "

" రాజేశ్వరి. "

మేరీ తెల్లబోయింది. ఆమె నమ్మలేదు.

"మేరీ, ఆమె నన్ను పోల్చలేదు. నే నిక్కడున్నానని ఆమెకు తెలీడం నా కిష్టంలేదు."

మేరీ వెళ్లిపోయింది. రాజేశ్వరి ప్రకృతావస్థకు జ్ఞా.లేసింది. Quarters కి బయలుదేరాను. రూములోకి పోయాను. శాంతిలేదు. రాత్రివరకు బ్రతుకుతుందా? ఏసును ప్రార్థించా మనస్సులో. తలుపువేసుకొని పడుకున్నాను.

* * * *

ఎవరో తలుపుతట్టేరు. చర్చిలో గంటలు కొడుతున్నారు.

"లైలా!"

తలుపు తెరచేను. మేరీ నించునుంది.

నాహృదయం కొట్టుకుంది. "ఆమె చనిపోయుంటుందా? ఎంతమంది మరణించుట లేదు" అనుకున్నాను.

"అతడు చనిపోయాడు."

"ఎవరు?"

"ఆవైశ్యుడు. Heart palpitation వల్ల చనిపోయాడు."

"ఏవైశ్యుడు?"

"నిన్నల్లరిపెట్టిన వైశ్యుడు."

"ఎప్పుడు?"

"ఎనిమిదిగంటలకి- డాక్టరు చెప్పేరు."

మేరీ నాముఖంలోకి చూస్తూంది.

"మేరీ, నువ్వెందు కలా చూస్తావు?"

"నీకు సంతుష్టిలేదా?

"లేదు. ఆమె యెలా వుంది?"

"తెలివివచ్చింది."

ఏసును ధ్యానించా వొక్కసారి.

3

సాయంకాలము ఏడుగంటలకి కారిడరుమీద మేరీ కలుసుగుంది.

"వెళ్లిపోయాడా?"

"ఎవరు?"

"అతడు."

"గంటక్రిందనే వెళ్లిపోయాడు."

"ఆమె ఎలా గుంది?"

"నీరసంజాస్తీగా వుంది."

"...........''

"నేను పోతున్నా."

మేరీ వెళ్లిపోయింది. తనలో ఆత డెంత కలతజెందుతున్నాడో అనుకున్నాను. 'మావయ్యా, నిన్నెంతేడిపించి దామె' అనుకున్నాను. 'నీ జీవితములో మరి శాంతిలేదేమో' అని వలవల యేడ్చేను.

"లైలా!"

కనులుతుడుచుకొని తిరిగి చూసేను.

డాక్టరు యెదుట నిలబడ్డారు. మాయిద్దరికీ యిల్లా సంభాషణ జరిగింది:

డా—ఏమి టాలోచిస్తున్నావు?

నేను—ఆమెవిషయమై.

డా—ఈరాత్రికి గడిస్తే బ్రతకొచ్చు.

నేను—గడవదా?

డా—రాత్రల్లా మేలుకోవాలి నువ్వు.

శూన్యదృష్టులతో అతని ముఖంకేసి చూచేను.

డా—అత డొచ్చేడు.

నేను—చూచేను.

డా—ఇప్పుడే వెళ్లిపోయాడు.

నేను—మేరీ చెప్పింది.

డా—ఆనందరావు నేనూ సహాధ్యాయులమని చెప్పేను.

నేను తెల్లబోయేను.

డా—కన్నుల నీరునించే డాతడు.

నేను మాట్లాడలేదు.

డా—నీ విక్కడున్నావని చెప్పలేదు.

నేను—ఇంతకాల మూరకున్నాడేమి ?

డా—Pregnancy అని యేమరి వూరుకున్నారు. నీరసం అధికమైంది. డాక్టరుకి చూపెట్టేరుట. కడుపు కాదు. ఓవరియన్ కిస్టు (Ovarian Cyst). ఆపరేషన్ చేయాలిసుంటుంది. హాస్పిటలుకి తీసుకువెళ్లమన్నాడు.

నేను—డాక్టరు! నన్నేమిచెయ్యమంటారు ?

డా—ఆమెను కనిపెట్టివుండాలి. రాత్రి తప్పితే భయములేదు.

నేను—నే నామెమొగం చూడలేను. మేరీ వుండకూడదా ?

డా—ఆమెకు స్వస్థతగా లేదు..........

...ఆతనికోసము నువ్వు కష్టపడు.

డాక్టరు వెళ్లిపోయారు. నేనల్లాగే నించుండిపోయాను.

* * * *

తలుపు తెరచేను.

“ లైలా ! ”

దగ్గర కెళ్లేను.

“ నే బ్రతుకుతానా ? ”

“ తప్పకుండా. ”

ఆమెచూపుల్లో ఆశ మందహాసంచేస్తూంది.

“ ఆసంగతి ఆతనితో చెప్పేరా ? ”

“ చెప్పేము. ”

ఆమె సంతుష్టి జెందినది.

“ అతడు వట్టి అమాయకుడు. రేపు మళ్లా వస్తారు.”......“అందాకా ఉండనూ? ”

“ ఉంటారు. ”

ఆమె నాకేసి చూచింది. ఆమె చూపుల్ని మళ్లించుకొన్నాను.

“ లైలా, యిల్లా రా. నాశరీరాన్ని పట్టుగో.”

వెళ్లి ఆమె శరీరమును పట్టుగున్నాను.

“ చల్లగా వుందికాదూ ? ”

“ లేదు. ”

“ చలిగాలి వేస్తూంది, కిటికీ వేసిపెట్టు.”

గ్లాసు ప్లేన్సు వేసీసేను.

“ లైలా, నువ్వు రాత్రల్లా యిక్కడే వుంటావుకాదూ ? ”

“ ఊఁ. ”

“ నీఋణము తీర్చుకోలేను.....నీవు దేవతవు.”

ఆమె యేదో గొణుగుకుంది.

“ మీ రట్టే మాట్లాడకండి. పడుకోండి. ”

“ పడుకుంటా...మీరుమాత్రం వెళ్లిపోవద్దు.”

“ వెళ్లను. ”

ఆమె కనులుమూసింది. వాచీ చూచేను. పదయింది. ప్రక్కని స్టూలుమీద కూర్చున్నాను. ఆలోచనలు పరిపరివిధాల పోయాయి. ఆమెచేతుల్లో నేనేలాంటి బాధ లనుభవించేనో తలంచుకొన్నాను. ‘కాల మెప్పుడూ యిల్లా వుంటుందా ?’ అంటే... “వుంటుం” దను ఆమెఅహంకార మిప్పు డేవయిందనుకున్నాను. ‘రాజేశ్వరీ, యిప్పుడు నీలీలావతే నీకు గతయిందే’ అనుకున్నాను. ‘నీవు పొమ్మనిన యీలీల నిద్రమానుకొని యిల్లా కూర్చుంది.’ ఆమెమొగంకేసి చూచేను. నిశ్చలంగా పడుకున్నుంది. ‘రాజేశ్వరీ, నీవల్ల యెన్నో కష్టా లనుభవించానుకాని నీమీద నా కిప్పుడు కోపంలేదు.’ ఆమె నిశ్చలాకారానికి భయము వేసింది. ఆమె బ్రతికుందా ? దగ్గరకు పోయి నాడిపరీక్షించేను. రిస్టువాచీ చూచేను. పదకొండయింది. తలుపుతీసి కారిడరుమీది కొచ్చాను. నిశ్శబ్దంగా వుంది. ఆప్రదేశమంతా. ఉదయిస్తోన్న చంద్రుణ్ణి చూస్తూ నించున్నా ఒక్కగడియ.

“ లైలా...లైలా ! ”

త్వరగా లోపలికి పోయాను.

“ లైలా ! ”

“ ఏమి ? ”

" నువ్వెళ్లిపోయావు... నేను చచ్చిపోతాను."

" భయములేదు."

" నీరసం జాస్తిగా వుంది."

డాక్టరుపెట్టిన మందు గ్లాసుల్లో పోసి ఆమెకు త్రావించేను.

" బలం చేస్తుంది."

" నువ్వెళ్లిపోకు."

" లేదు."

" నావిషయమై నువ్వు చాలా కష్టపడు తున్నావు."

" నాకు కష్టములేదు."

" నీపేరు లైలాకామా ?..."

" మీరు మాట్లాడకండి......నీరసం హెచ్చవు తుంది."

" ఆమె నీయంతే వుండేది."

" ఎవరు ?"

" మాలీలావతి."

మంచము వదలి నేను లాకరుకేసి పోయాను. ఒళ్లు వణికింది.

" ఇప్పుడామె యెక్కడుందో..."

" మీరు పడుకోక్కూడదూ ?"

" పడుక్కుంటా."

ఆమె కనులుమూసింది. నేను బయటబడ్డాను. " రాజేశ్వరీ, నిన్నెన్నోమాట లంటున్నాను. నిన్నిప్పు డేమీ అనకూడదు." అనుకున్నాను. " మావయ్యకు నిన్నప్పజెప్పగలనా ?" అనుకున్నాను. ఆమె నెల్లాగో బ్రతికించుకోగలనని ధైర్యం వహించేను. క్రిందికి చూచాను. ఆయాలు అక్కడక్కడ మేలుకొని వున్నారు.

అల్లా నించున్నా.

ఒంటిగంట కొట్టేరు.

* * * *

రెండు.

* * * *

మూడు. అలాగే వున్నా, ఆచలిగాలిలో.

* * * *

నాలుగు.

గదిలోకి పోయాను. ఆమె లేవలేదు. శరీరము పరీక్షించేను. చల్లగా వుంది. నాకు భయంవేసింది. నాడి మాత్రం వుంది. అరగంటయింది. ఆమె కదిలింది.

" లైలా !"

" ఎందుకు ?"

" దగ్గరకు రా."

" ఏమిఁ ?"

" నాకు భయంవేసింది."

మందు త్రావించేను.

ఆమె నాముఖంలోకి చూచింది.

" లీలావతీ, నువ్వే !!"

ఆమె మూర్ఛపోయింది.

నాకు మతిపోయింది.

స్టిములెంటు మిక్స్చరు (Stimulent mixture) త్రావించేను. అయిదునిముషాలు చూచేను. ఆమెకు తెలివి రాలేదు. పైకి వచ్చాను. గ్రుడ్డివెన్నెల కాస్తోంది. Duty డాక్టరుకి ఫోనుచేసా. అయిదునిముషాలలో డాక్టరొచ్చారు.

" లైలా, ఆమె కేమిఁయు భయములేదు."

" బ్రతుకుతుందా?"

" తప్పకుండా."

* * * *

౪

రూముకొచ్చి యెల్లా పడుకున్నానో. తెలి వొచ్చేసరికి మూడయింది. మేరీగదికేసి వెళ్లేను. ఆమె అప్పుడే వెళ్లిపోయింది. నాగదిలోకి పోయి టెలిఫోను తీసేను.

" మేరీ! "

" ఆఁ. "

" డాక్టరుగా రెక్కడున్నారు ? "

" ఇంకా రాలేదు. "

" ఆమె యెల్లావుంది ? "

" నయంగా వుంది. "

మనసు సంతుష్టిపడ్డాది.

అరగంట పోయింది.

టెలిఫోనుగంట మ్రోగింది.

" ఎవరు ? "

" మేరీని. "

" ఎందుకు ? "

" సత్యనారాయణగారొచ్చేరు. వెళ్లికలుసుగో."

Dress వేసుకోని బయలుదేరాను హాస్పిటలుకి. గదిలో డాక్టరుగారూ, ఆయనా మాట్లాడుతున్నారు. లోపలికి వెళ్లాను. ఆయన పరికించి చూచేను.

" లీలావతీ ! "

" అవు " నన్నాను.

ఆమె నన్ను పిలిచింది.

దగ్గరకు పోయాను. ఆమెజాలిచూపులు రక్తిమవహించేయి.

" లీలా...నిన్నెన్నోకష్టాలు పెట్టేను. నిన్ను దిక్కుమాలినదాన్ని చేసా......అట్టినన్ను రక్షించావు. నన్ను క్షమించు. చిన్నదానివైనా నీకు భక్తిపూర్వకంగా నమస్కారము చేస్తున్నా. "

ఆమె చేతులు జోడించింది.

నాహృదయము కరగిపోయింది.

ఆమెచేతులు విడదీసా.

"నీ పవిత్రత నే గ్రహించలేకపోయాను. నేను దురదృష్ట వంతు రాలిని......ఇంటికి వెళ్లిపో రా. "

" నాకు కష్టమని తోచినపుడు వస్తాను. "

అతనికేసి చూచేను. వలవల యేడుస్తున్నాడతడు.

" మావఁయ్యా, నీవు దుఃఖించవద్దు. నా కిక్కడ సుఖముగానే వుంది. "

అతడు సెలవుతీసుకొని వెళ్లిపోయాడు. నెల రోజులలో రాజేశ్వరికూడా వెళ్లిపోయింది. వెళ్లిపోయేటప్పుడు రమ్మని బ్రతిమాలింది. అదే జవాబు చెప్పేను. కాని యిప్పటి కింకా యీపవిత్రజీవనమే చేస్తున్నాది లైలా.